పీఎఫ్ డిపాజిట్లపై వడ్డీ రేటు యథాతథం?

నిరుటి మాదిరిగానే 8.25 శాతంగా కొనసాగే అవకాశం

న్యూఢిల్లీ: పీఎఫ్ డిపాజిట్లపై వడ్డీ రేటును ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) నిరుటి మాదిరిగానే యథాతథంగా కొనసాగించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ నెల 28న జరిగే ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సమావేశంలో దీనిపై స్పష్టత వస్తుంది. గత ఏడాది ఈ రేటు 8.25 శాతం అనే సంగతి తెలిసిందే. ఈ ఆర్థిక సంవత్సరం తాలూకు ఆదాయ, వ్యయాలను ఈపీఎఫ్ఓ పెట్టుబడులు, ఖాతాల కమిటీ సమీక్షించి, ఓ వడ్డీ రేటును సూచిస్తుంది. ఈ రేటును కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదించాలి.

పెండ్లి వేడుకలోకి చిరుత

గంటలపాటు కారులో దాక్కున్న వధూవరులు

లక్నో: లక్నోలో ఓ పెండ్లి వేడుకలోకి చిరుతపులి ప్రవేశించటంతో హాజరైన వారంతా హాహాకారాలు చేస్తూ తలోదిక్కుకు పరుగెత్తారు. అందరూ భోజనం చేస్తుండగా, వధూవరులు ఫొటోలు దిగుతుండగా..చిరుతపులి వారి ముందు ప్రత్యక్షమైంది. పరుగు అందుకున్న వధూవరులు కారులో దాక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆహ్లాదం.. కోలాహలంతో నిండిన మ్యారేజ్ హాల్‌లో పరిస్థితి తారుమారైంది. పోలీసులు, అటవీ శాఖ అధికారులు వెంటనే రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఫంక్షన్ హాల్ మొదటి అంతస్తులో చిరుతపులిని సిబ్బంది పట్టుకోగలిగారు. ఈ ప్రయత్నంలో అటవీ శాఖ అధికారి భుజాన్ని చిరుత పంజాతో గాయపర్చింది.

ఫాస్టాగ్‌కు కొత్త రూల్స్

- ***పాటించకపోతే రెట్టింపు చార్జి***
- ***ఫిబ్రవరి 17 నుంచి అమల్లోకి..***

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: ఫాస్టాగ్ లావాదేవీలకు సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) కొత్త నిబంధనలు తీసుకువస్తున్నది. టోల్ గేట్ల వద్ద లావాదేవీలు సులువుగా జరిగేలా, మోసాలు నివారించేలా తీసుకువచ్చిన ఈ నిబంధనలు ఫిబ్రవరి 17 నుంచి అన్ని టోల్ ప్లాజాల వద్ద అమలులోకి రానున్నాయి.

ఫాస్టాగ్ కొత్త నిబంధనలు

1. వాహనం టోల్ బూత్‌కు చేరడానికి ముందు 60 నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్ అయి ఉన్నా, హాట్‌లిస్ట్‌లో ఉన్నా, బ్యాలెన్స్ తక్కువగా ఉన్నా టోల్ బూత్ వద్ద ఫాస్టాగ్ లావాదేవీ విఫలమవుతుంది.

2. టోల్ బూత్ వద్ద స్కాన్ చేసిన 10 నిమిషాల వరకు ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్‌లో ఉన్నా, ఇన్‌యాక్టివ్‌గా ఉన్నా లావాదేవీ తిరస్కరణకు గురవుతుంది. ఈ రెండు సందర్భాల్లో 176 ఎర్రర్ కోడ్‌తో లావాదేవీ విఫలమవుతుంది. వాహనానికి జరిమానా కింద రెట్టింపు టోల్ చార్జ్ పడుతుంది.

ఫాస్టాగ్ ఎందుకు బ్లాక్‌లిస్ట్ అవుతుంది?

- సరిపడా బ్యాలెన్స్ లేనప్పుడు
- కేవైసీ ధ్రువీకరణ పెండింగ్‌లో ఉంటే
- వాహనం రిజిస్ట్రేషన్ వివరాల్లో తేడాలు ఉన్నప్పుడు

ఫాస్టాగ్ వినియోగదారులు ఏం చేయాలి?

జరిమానాలు పడకుండా ఉండేందుకు, ఫాస్టాగ్ లావాదేవీలు సులువుగా పూర్తయ్యేందుకు వినియోగదారులు..

- టోల్ ప్లాజా వద్దకు చేరడానికి ముందుగానే ఫాస్టాగ్‌లో సరిపడా బ్యాలెన్స్ ఉండేలా చూసుకోవాలి.
- ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్ కాకుండా ఎప్పటికప్పుడు కేవైసీ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలి.
- ప్రయాణాలు ప్రారంభించడానికి ముందే ఫాస్టాగ్ స్టేటస్‌ను పరిశీలించుకోవాలి.

రెండో బ్యాచ్ కింద 180 మంది

- **స్వదేశానికి వలసదారులు**
- **రేపు అమృత్‌సర్‌కు విమానం!**
- **మోదీ అమెరికా పర్యటన వేళ ట్రంప్ సర్కార్ చర్యలు**

వాషింగ్టన్: అక్రమ వలసదారుల ఏరివేతలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరిన్ని చర్యలు దిగుతున్నారు. భారత ప్రధాని మోదీ అమెరికాలో పర్యటిస్తున్న సమయంలోనే, వందలాది మంది భారత వలసదారుల్ని రెండో బ్యాచ్ కింద స్వదేశానికి పంపడానికి ట్రంప్ సర్కార్ సిద్ధమైంది. 180 మంది భారతీయుల్ని స్వదేశానికి పంపేందుకు అమెరికా ప్రభుత్వం ఏర్పాట్లు చేసినట్టు తెలిసింది. వీరు శనివారం అమృత్‌సర్‌కు చేరుకోనున్నట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. అధికారికమైన ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. వీళ్లంతా డంకీ రూట్, ఇతర మార్గాల్లో అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన వ్యక్తులుగా ఆ దేశం పేర్కొంటున్నది. దీంతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి.. అమెరికాకు చేరుకున్న భారతీయుల్లో ఆందోళన నెలకొన్నది.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

- **కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్**
- **ఇటీవల సీఎం బీరేన్ రాజీనామా**
- **తదుపరి సీఎం అభ్యర్థి ఎంపికపై బీజేపీలో కుదరని ఏకాభిప్రాయం**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో కేంద్రం గురువారం రాష్ట్రపతి పాలన విధించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫిబ్రవరి 9న సీఎం బీరేన్ సింగ్ రాజీనామా సమర్పించటం, ఆ వెంటనే గవర్నర్ నివేదిక రాష్ట్రపతికి చేరటం వెంట వెంటనే జరిగిపోయాయి. 'మణిపూర్ గవర్నర్ అందజేసిన నివేదికతో పాటు ఇతర నివేదికల సమాచారం పరిశీలించాక, అక్కడ రాజ్యాంగబద్ధ పాలన కొనసాగించే పరిస్థితి లేదనే నిర్ధారణకు వచ్చాం. ఈ నేపథ్యంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 అధికారాలు ఉపయోగించి మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ నిర్ణయం తీసుకున్నాం' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన ఆదేశాల్లో పేర్కొన్నారు. దీంతో మణిపూర్ శాసనసభ సుప్త చేతనావస్థలో వెళ్తున్నట్టు ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై విపక్ష కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్ స్పందిస్తూ, 'రాష్ట్రంలో సామాజిక వ్యవస్థ పూర్తిగా ధ్వంసం అయిన తర్వాత కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థ కుప్పకూలిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 300మందికిపైగా ప్రాణాలు కోల్పోయాక, 60వేల మంది నిరాశ్రయులయ్యాక రాష్ట్రపతి పాలన విధించారు' అని ఆయన విమర్శించారు. కాగా, రాష్ట్ర శాసనసభ రద్దు కాలేదని, పరిస్థితులు మెరుగుపడ్డాక రాష్ట్రపతి పాలన ఎత్తేస్తారని మణిపూర్ బీజేపీ చీఫ్ ఏ శారద అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత శాసనసభ కాలపరిమితి 2027తో ముగియనున్నది. ఇక్కడ గత 21 నెలలుగా కొనసాగుతున్న అల్లర్లు, హింస కారణంగా దాదాపు 300మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. సీఎం పదవికి బీరేన్‌సింగ్ రాజీనామా చేశాక, సీఎం అభ్యర్థిని ఎంపిక చేయటంలో అధికార బీజేపీ విఫలమైంది. పార్టీ ఎమ్మెల్యేలతో ఇంచార్జ్ సంబిత్ పాత్ర పలు దఫాలుగా చర్చలు జరిపినా.. సీఎం అభ్యర్థిపై ఏకాభిప్రాయం రాలేదని తెలిసింది.

పతనం దిశగా కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి...

ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ అంతకంతకూ పడిపోతున్నదని అర్థమవుతున్నది. దీన్ని ధ్రువపరుస్తూ.. గత లోక్‌సభ ఎన్నికల్లో సెంచరీకి చేరువగా వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు పెడితే ఆ దరిదాపుల్లోకి కూడా వచ్చే పరిస్థితి లేదని తేటతెల్లమైంది. ఈ మేరకు ఇండియా టుడే-సీవోటర్ మూడ్ ఆఫ్ నేషన్ (ఎంవోటీఎన్) పేరిట నిర్వహించిన తాజా సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.

సర్వేలో తేలింది ఇది..

ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీకి 78 స్థానాలు మాత్రమే వచ్చే అవకాశం ఉందని సర్వే తేల్చిచెప్పింది. నిరుడు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన సీట్లు 99తో పోలిస్తే, ఇప్పుడు ఆ పార్టీకి ఏకంగా 21 స్థానాలు తగ్గే అవకాశం ఉన్నట్టు పేర్కొంది. గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 21.5 శాతం మేర ఓట్లు రాగా, ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే ఆ పార్టీకి ఓటు బ్యాంకు 1.5 శాతం మేర తగ్గి, 20 శాతం మేర మాత్రమే ఓట్లు రావొచ్చని సర్వేలో తేలింది. ఇదే సమయంలో బీజేపీకి 3 శాతం మేర ఓటు షేరు పెరుగొచ్చని అభిప్రాయపడింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి సీట్లు కూడా భారీగా తగ్గిపోనున్నట్టు ఈ సర్వే అంచనా వేసింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 232 సీట్లు సాధించిన ఇండియా కూటమి ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే



44 సీట్లు తగ్గి, 188 సీట్లకే పరిమితం అవుతుందని తేల్చింది. కాగా లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బోల్తాపడింది. ఢిల్లీలో వరుసగా మూడోసారి హ్యాట్రిక్ జీరో సీట్లు సాధించడమూ తెలిసిందే.

ప్రజాదరణ పొందని కాంగ్రెస్ సీఎంలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహ కాంగ్రెస్ ముఖ్యమంత్రుల ప్రజాదరణ కూడా అంతంతే అని మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే తేల్చింది. దేశంలో ప్రజాదరణ కలిగిన ముఖ్యమంత్రుల జాబితాలో 62.1 శాతంతో సిక్కిం సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్ ఉన్నారు. ఆ తర్వాత వరుసగా స్టాలిన్(తమిళనాడు), హిమంత బిశ్వ శర్మ(అస్సాం), భూపేంద్ర భాయ్ పటేల్(గుజరాత్), చంద్రబాబు నాయుడు(ఏపీ), మమతా బెనర్జీ(పశ్చిమ బెంగాల్), పేమా ఖండూ(అరుణాచల్ ప్రదేశ్), మాణిక్ సాహా(త్రిపుర) నిలిచారు. వీరందరికీ 40 శాతం కంటే ఎక్కువ ప్రజాదరణ ఉన్నట్టు ఈ సర్వేలో వెల్లడైంది. కాంగ్రెస్‌కు ఉన్న ముగ్గురు ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య(కర్ణాటక), సుఖ్‌విందర్ సింగ్ సుఖు(హిమాచల్ ప్రదేశ్)కు 40 శాతం ప్రజాదరణ కూడా దక్కలేదని ఈ సర్వేలో తేలింది.

రాష్ట్రాల్లో తీవ్ర వ్యతిరేకత

కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ రాష్ట్రాల్లోనూ ఆ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఆరు గ్యారెంటీల పేరిట తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ.. ఏడాది గడిచినప్పటికీ ప్రకటించిన గ్యారెంటీలను అమలు చేయలేదు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అటకెక్కి.. రాష్ట్రంలో కబ్జాలు, శాంతిభద్రత సమస్యలు పెచ్చరిల్లుతున్నాయి. పొరుగురాష్ట్రం కర్ణాటకలోనూ ఇదే పరిస్థితి. ఐదు గ్యారెంటీలను అమలు చేయలేక అక్కడి సిద్ధరామయ్య సర్కారు ఆపసోపాలు పడుతున్నది. ఒకవైపు స్కామ్‌లు మరోవైపు ఛార్జీల పెంపుతో కన్నడ ప్రజలు లబోదిబోమంటున్నారు. ఇక, కాంగ్రెస్ పాలనలో హిమాచల్ ఏకంగా దివాలా అంచుకు చేరడం తెలిసిందే.

మస్క్‌తో మోదీ భేటీ

స్టార్‌లింక్ పెండింగ్ లైసెన్స్ గురించి ప్రస్తావన?

వాషింగ్టన్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌తో సమావేశమయ్యారు. వాషింగ్టన్‌లోని బ్లెయిర్ హౌస్‌లో జరిగిన ఈ సమావేశానికి మస్క్ తన ముగ్గురు పిల్లలు ఎక్స్, స్ట్రైడర్, అజ్యూర్‌లతో కలిసి వచ్చారు. మోదీతో పాటు విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఉన్నారు. దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడ్మినిస్ట్రేషన్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీకి మస్క్ నాయకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. మస్క్-మోదీ చర్చల్లో ముఖ్యంగా స్టార్‌లింక్ పెండింగ్ లైసెన్స్ గురించి ప్రస్తావిస్తారని తెలుస్తున్నది.

ప్రతీకార సుంకాలపై నిర్ణయం

ఇదిలావుండగా, మోదీతో భేటీకి కొద్ది గంటల ముందు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతీకార సుంకాలపై గురువారం ముఖ్యమైన నిర్ణయం తీసుకుంటానన్నారు. దీనికి సంబంధించిన ఆదేశాలపై సంతకం చేస్తానని తెలిపారు.

అమెరికాలో ఎగ్స్ ధర పైపైకి

వాషింగ్టన్: అమెరికాలో కోడి గుడ్ల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కొన్ని చోట్ల ప్రజలకు గుడ్లు దొరకడం లేదు. కొన్ని చోట్ల స్టోర్లలో నో ఎగ్స్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో గుడ్ల విక్రయాలపై స్టోర్లు పరిమితులు విధిస్తున్నాయి. ఒక్కొక్కరికి గరిష్ఠంగా రెండు, మూడు ట్రేలు మాత్రమే ఇస్తున్నాయి. దీంతో చాలా మంది వీటి వినియోగాన్ని తగ్గించుకుంటున్నారు. జనవరి నెల వినియోగదారుల ధరల సూచీ ప్రకారం అమెరికన్ సిటీలలో డజన్ గ్రేడ్ ఏ గుడ్ల సగటు ధర 4.95 డాలర్లు (సుమారు రూ.430).

మణిపూర్‌లో జవాన్ ఘాతుకం

- **తోటి జవాన్లపై కాల్పులు.. ఇద్దరు మృతి**
- **అనంతరం ఆత్మహత్య**

ఇంఫాల్: మణిపూర్‌లోని పశ్చిమ ఇంఫాల్ జిల్లా, లంసంగ్‌లో ఉన్న సీఆర్‌పీఎఫ్ క్యాంపులో గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో దారుణం జరిగింది. మణిపూర్ పోలీసులు ఎక్స్ వేదికగా తెలిపిన సమాచారం ప్రకారం, ఓ జవాన్ విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోగా, 8 మంది గాయపడ్డారు. అనంతరం ఆ జవాన్ కూడా తనను తాను కాల్చుకుని మరణించారు. వ్యక్తిగత వివాదమే దీనికి కారణమని తెలుస్తున్నది.

కేంద్రంతో నేడు రైతుల చర్చలు

చండీగఢ్, ఫిబ్రవరి 13: ఎమ్మెస్పీకి చట్టబద్ధత సహా.. రైతు సమస్యలపై చర్చించేందుకు రైతు సంఘాలు, కేంద్రం నేడు చండీగఢ్‌లో సమావేశం కాబోతున్నాయి. 28 మంది సభ్యులతో కూడిన రైతు ప్రతినిధి బృందం ఈ సమావేశాల్లో పాల్గొంటున్నదని, పలు అంశాలపై కేంద్రంతో చర్చిస్తుందని ఎస్కేఎం (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా గురువారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

బెంగళూరు మెట్రో చార్జీలపై యూటర్న్

ప్రజావ్యతిరేకతతో వెనక్కి తగ్గిన కర్ణాటక కాంగ్రెస్ సర్కారు

బెంగళూరు: బెంగళూరు మెట్రో చార్జీలను అసాధారణంగా పెంచటంపై కర్ణాటక కాంగ్రెస్ సర్కార్ ప్రజా ఆగ్రహానికి గురైంది. దీంతో పెంచిన చార్జీలపై వెనక్కి తగ్గాల్సి వచ్చింది. మొత్తంగా బెంగళూరు మెట్రో చార్జీలను 30 శాతం వరకు తగ్గిస్తూ 'బీఎంఆర్‌సీఎల్' గురువారం నిర్ణయం తీసుకుంది. ధరల మార్పు వెంటనే అమల్లోకి వస్తుందని కార్పొరేషన్ ఎండీ మహేశ్వర్ రావ్ ప్రకటించారు. ప్రజలు, మెట్రో చార్జీల్ని 47శాతం పెంచుతూ తీసుకున్న నిర్ణయం ఈనెల 9 నుంచి అమల్లోకి రాగా, ప్రజల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. సోషల్ మీడియా 'ఎక్స్'లో హ్యాష్‌ట్యాగ్ 'బాయ్‌కాట్ మెట్రో' పెద్ద ఎత్తున సాగింది. ఇటీవల చార్జీల పెంపుతో ప్రయాణికుల సంఖ్య రోజు రోజుకూ బాగా తగ్గింది.

లంకలో అదానీ పీఛేముడ్

- **బిలియన్ డాలర్ల ప్రాజెక్టుల నుంచి తప్పుకొంటున్నట్టు సంస్థ ప్రకటన**
- **డీల్, ధరను పునఃసమీక్షిస్తామని లంక ప్రకటించగానే వెనక్కి?!**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)



హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): శ్రీలంకలో బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తామన్న రెండు పవన విద్యుత్తు ప్రాజెక్టులపై ప్రపంచ కుబేరుడు గౌతమ్ అదానీ వెనక్కి తగ్గారు. ప్రతిపాదిత ప్రాజెక్టుల నుంచి తప్పుకుంటున్నట్టు అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. శ్రీలంకలోని గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టు ఒప్పందం కుదిరింది. అయితే, ఈ ప్రాజెక్టుతో సమీపంలోని బర్డ్ కారిడార్‌పై, స్థానిక మత్స్య పరిశ్రమపై ప్రతికూల ప్రభావం పడుతుందని స్థానికులు పెద్దయెత్తున ఆందోళనలు చేపట్టారు. ఒప్పందంలో భాగంగా చేసుకొన్న విద్యుత్తు ఛార్జీలు చాలా ఎక్కువగా ఉన్నాయన్న విమర్శలు కూడా వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో తాను అధికారంలోకి వస్తే అవినీతి ప్రాజెక్టులను రద్దు చేస్తానంటూ నిరుడు అనురా కుమార దిసనాయకే హామీనిచ్చారు.

సమీక్షిస్తామనగానే..

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి తగ్గట్టే, అదానీ పవన విద్యుత్తు ప్రాజెక్టులపై శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే దృష్టిసారించారు. డీల్ జరిగిన విధానం, విద్యుత్తు ఛార్జీలపై నిర్ణయంపై అదానీ కంపెనీ ప్రతినిధులతో పునఃసమీక్ష చేయాల్సిందిగా కెయిలాన్ ఎలక్ట్రిసిటీ బోర్డు, మినిస్ట్రీ ఆఫ్ కొలంబో అధికారులను ఆదేశించారు. అధికారులు ఈ చర్యలకు సమాయత్తమవుతుండగానే.. తాము ఈ ప్రాజెక్టు నుంచి వైదొలుగుతున్నట్టు అదానీ కంపెనీ ప్రకటించడం చర్చనీయాంశమైంది.

జైల్లో ఉంచడానికే పీఎంఎల్ ఏనా?

మొదటిపేజీ తరువాయి...

కొట్టివేసినప్పటికీ నిందితుడిని ఇంకా కస్టడీలో ఉంచడంపై ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తంచేసింది. 'పీఎంఎల్‌ఏ ఉద్దేశం ఓ వ్యక్తిని జైల్లోనే ఉంచడం కాదు. హైకోర్టు క్వాష్ చేసిన తరువాత కూడా ఆ వ్యక్తిని జైలులోనే ఉంచాలన్న ధోరణిని కొనసాగిస్తే ఇక ఏం చెప్పగలం? 498ఏ కేసుల్లో ఏం జరుగుతున్నదో చూడండి. పీఎంఎల్‌ఏ కూడా అలాగే దుర్వినియోగమవుతున్నదా?' అని వ్యాఖ్యానించింది. త్రిపాఠీకి బెయిల్ ఇవ్వొద్దని ఈడీ తరఫు న్యాయవాది వాదనపై ధర్మాసనం స్పందిస్తూ.. 'హైకోర్టు క్వాష్ చేసిన విషయం ఈడీకి తెలిసి ఉండటం ఆశ్చర్యపరుస్తున్నది. ఈడీ అధికారులకు సమన్లు ఇవ్వాల్సి వస్తుంది. మనం ఎలాంటి సంకేతాలు ఇస్తున్నాం?' అని ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఈడీ తీరుపై న్యాయస్థానాల ఆగ్రహం

పీఎంఎల్‌ఏ కేసుల విచారణలో ఈడీ వ్యవహరిస్తున్న తీరుపై ఇటీవల సుప్రీంకోర్టు, హైకోర్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఓ హర్యానా కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యేను 15 గంటల పాటు విచారించడాన్ని సుప్రీంకోర్టు ఇటీవల తీవ్రంగా తప్పుబట్టింది. ఈడీ తీరు అమానవీయమని, అహంకారపూరితమని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఓ మహిళ బెయిల్ పిటిషన్‌ను ఈడీ వ్యతిరేకించగా, ఈడీ వాదనలు పీఎంఎల్‌ఏ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, ఈ వైఖరిని సహించబోమని సుప్రీంకోర్టు మండిపడింది. హవాలా కేసుల్లో నేర నిరూపణ తక్కువగా ఉండటంపైనా కోర్టు అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. ఈడీ కొంత శాస్త్రీయ విచారణ జరపాలని సూచించిన సంగతి తెలిసిందే.



చదువుకున్న భార్య ఖాళీగా ఉంటూ, భరణం కోరకూడదు

ఒరిస్సా హైకోర్టు తీర్పు

భువనేశ్వర్: బాగా చదువుకున్న భార్యకు లాభదాయకమైన ఉద్యోగం చేసిన అనుభవం ఉన్నప్పటికీ, కేవలం తన భర్త నుంచి పోషణ భత్యాన్ని కోరడం కోసం ఖాళీగా ఉండకూడదని ఒరిస్సా హైకోర్టు చెప్పింది. ఆమెకు పోషణ భత్యం కింద నెలకు రూ.8,000 ఇవ్వాలని కుటుంబ న్యాయస్థానం ఆమె భర్తకు ఇచ్చిన ఆదేశాలను సవరించి, నెలకు రూ.5,000కు తగ్గించింది. సరైన, ఉన్నత స్థాయి విద్యార్హతలు ఉన్నప్పటికీ, భర్తపై పోషణ భత్యం భారం మోపాలనే ఉద్దేశంతో, ఏదైనా ఉద్యోగం లేదా పని చేయకుండా ఖాళీగా కూర్చునే భార్యను చట్టం మన్నించదని తెలిపింది. తమను తాము పోషించుకునే స్థితిలో లేని భార్యలకు ఉపశమనం కల్పించడమే సీఆర్‌పీసీ సెక్షన్ 125 లక్ష్యమని చెప్పింది.

పార్లమెంటుకు వక్ఫ్ నివేదిక

- **ఉభయ సభల్లో ప్రవేశపెట్టిన పార్లమెంటరీ కమిటీ**
- **భిన్నాభిప్రాయాలు తొలగించారని విపక్షాల ఆరోపణ**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: వక్ఫ్(సవరణ) బిల్లుపై ఏర్పడిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) తన నివేదికను గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టింది. లోక్‌సభలో జేపీసీ చైర్మన్ జగదాంబికా పాల్, రాజ్యసభలో జేపీసీ సభ్యురాలు మేధా విశ్రమ్ కుల్‌కర్ణి నివేదికను ప్రవేశపెట్టారు. అయితే, జేపీసీలో భాగంగా ఉన్న ప్రతిపక్ష సభ్యులు వ్యక్తం చేసిన భిన్నాభిప్రాయాలను ఈ నివేదిక నుంచి తొలగించారని విపక్ష సభ్యులు ఆరోపించారు. నివేదికను లోక్‌సభలో ప్రవేశపెడుతున్నప్పుడు ప్రతిపక్ష ఎంపీలు వాకౌట్ చేసి నిరసన తెలిపారు. అయితే, భిన్నాభిప్రాయాలను నివేదికలో చేర్చడానికి తమకేమీ అభ్యంతరం లేదని లోక్‌సభ స్పీకర్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. జేపీసీ నివేదికను ఉపసంహరించుకోవాలని రాజ్యసభలో విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. ఇది ఫేక్ నివేదిక అని, మెజారిటీ సభ్యుల ఆలోచనలనే నివేదికలో పొందుపర్చడం అప్రజాస్వామికమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. కాగా, నివేదికలోని కొన్ని భాగాలకు తొలగించే అధికారం కమిటీ చైర్మన్‌కు ఉంటుందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు.

ఉభయసభలు వాయిదా

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు వాయిదా పడ్డాయి. మార్చి 10 ఉదయం 11 గంటలకు రాజ్యసభను వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ ధన్‌కడ్, లోక్‌సభను వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా గురువారం ప్రకటించారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం మీద 173 మంది ఎంపీలు, బడ్జెట్‌పై చర్చలో 170 మంది ఎంపీలు మాట్లాడారని స్పీకర్ తెలిపారు.

దేశవ్యాప్తంగా ఉద్యమిస్తాం

వక్ఫ్ బిల్లుపై జేపీసీ ఇచ్చిన నివేదికను ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు తీవ్రంగా వ్యతిరేకించింది. ముస్లింల అభిప్రాయాలను ఈ కమిటీ పూర్తిగా విస్మరించిందని, ఏకపక్షమైన అప్రజాస్వామిక ప్రక్రియను అవలంబించిందని లా బోర్డు అధ్యక్షుడు ఖలీద్ సైఫుల్లా రహ్మానీ ఆరోపించారు. పార్లమెంటులో బిల్లు పాసయితే, దానిని వ్యతిరేకిస్తూ రాజ్యాంగబద్ధంగా దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు.



లోక్‌సభలో వక్ఫ్ బిల్లుపై విపక్షాల నిరసన

లవ్ లైఫ్‌లో సంతోషం అంతంతే!

న్యూఢిల్లీ: తమ లవ్ లైఫ్ అంత సంతోషంగా సాగడం లేదని చాలా మంది భారతీయులు చెప్తున్నారు. ఇప్సోస్ అనే సంస్థ 30 దేశాల్లో ప్రేమ జీవితంపై సర్వే నిర్వహించింది. 'లవ్ లైఫ్ శాటిస్ఫాక్షన్ 2025' పేరుతో ప్రేమికుల రోజు సందర్భంగా ఈ సర్వే ఫలితాలను విడుదల చేసింది. సంతృప్తికర ప్రేమ జీవితాలు సాగిస్తున్న వారు భారత్‌లో తక్కువేనని ఈ సర్వే తేల్చింది. కొలంబియాలో అత్యధికంగా 82%, థాయ్‌లాండ్, మెక్సికో, ఇండోనేషియాలో 81% మంది ప్రేమ జీవితాలు సంతృప్తికరంగా ఉన్నట్టు ఈ సర్వేలో తేలగా, భారత్‌లో 63% మంది మాత్రమే సంతృప్తిగా ఉన్నారట. ఉమ్మడి కుటుంబం, కుటుంబ బాధ్యతలు, పని ఒత్తిళ్ల కారణంగా భారతీయులు ప్రేమ, లైంగిక జీవితానికి ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నారట.

రాకెట్ లేకుండానే రోదసిలోకి శాటిలైట్లు!

- **అతి తక్కువ ఖర్చుతో ప్రయోగం**
- **పర్యావరణానికి అనుకూలం**
- **స్పిన్‌లాంచ్ సరికొత్త ఆవిష్కరణ**
- **2026 నుంచి అందుబాటులోకి?**

ఢిల్లీ, ఫిబ్రవరి 13: అంతరిక్ష ప్రయోగాల్లో సరికొత్త విప్లవం. రాకెట్ అవసరం లేకుండానే ఇకపై శాటిలైట్లను ప్రయోగించవచ్చు. కాలిఫోర్నియా కేంద్రంగా పనిచేస్తున్న స్పిన్‌లాంచ్ కంపెనీ ఈ మేరకు నూతన లాంచింగ్ సిస్టమ్‌ను ఆవిష్కరించింది. కైనెటిక్ లాంచ్ సిస్టమ్ (సెంట్రిఫ్యూయల్ లాంచ్ టెక్నాలజీ)గా పిలుస్తున్న దీని సాయంతో 5 వేల ఎంపీహెచ్ వేగంతో శాటిలైట్లను లో ఎర్త్ ఆర్బిట్‌లోకి పంపించవచ్చు. ఈ స్పిన్‌లాంచ్ ఇంధనాన్ని స్పిన్నింగ్ సెంట్రిఫ్యూజ్‌గా మార్చుకొని ఉపగ్రహాలను అత్యంత వేగంగా ఆకాశంలోకి దూసుకెళ్లేలా చేస్తుంది. స్పిన్‌లాంచ్ విద్యుత్తు శక్తి ఆధారంగా పని చేస్తుంది. తద్వారా ఇంధనం అవసరం ఉండదు. అంతేకాదు, ప్రయోగ సమయంలో ఇది 10,000 జీఎస్‌ను కూడా తట్టుకుంటుంది. సాధారణ రాకెట్లతో పోలిస్తే ఇది 100 రెట్లు ఎక్కువ. 200 కిలోల కంటే తక్కువ బరువున్న పేలోడ్‌లను ప్రయోగించేందుకు ఈ విధానం అనుకూలమని కంపెనీ వర్గాలు తెలిపాయి.



ఓజోన్ పొర క్షీణతను నివారించవచ్చు

సాంప్రదాయ రాకెట్లు ఒక్కో ప్రయోగానికి 9 లక్షల పౌండ్ల ఇంధనం అవసరం. అయితే, స్పిన్‌లాంచ్ పూర్తిగా ఇంధన రహితం కానప్పటికీ, సాంప్రదాయ రాకెట్లతో పోలిస్తే సుమారు 90 శాతం ఇంధనం తక్కువ ఉపయోగిస్తుంది. ఉపగ్రహ లక్ష్యాలను చేరుకునేందుకు దీనికి చిన్నపాటి థ్రస్టర్లు అవసరమవుతాయి. ఆ సమయంలో మాత్రమే ఇంధన అవసరం ఉంటుంది. అతి తక్కువ ఇంధన వాడకం వల్ల ఓజోన్ పొర క్షీణతను నివారించే ఆస్కారం ఉంది. దీని గ్రావిటీ ఫోర్స్ మానవ సహిత ప్రయోగాలకు అనుకూలమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భవిష్యత్తులో మానవ సహిత మిషన్ల కోసం ప్రయోగించే ఆస్కారం లేకపోలేదని అంటున్నారు. ఇప్పటికే 11 నెలల్లోనే 10 ప్రయోగాలను కంపెనీ విజయవంతంగా చేపట్టింది. 2026 నుంచి పూర్తిస్థాయి ప్రయోగాలు చేపట్టనున్నట్టు కంపెనీ సీఈవో జోనాథన్ యానీ వెల్లడించారు. కార్నెల్ యూనివర్సిటీ ఇంజినీర్లు స్పిన్‌లాంచ్‌కు అనుగుణంగా పేలోడ్‌లను అభివృద్ధి చేస్తున్నారు. అతి తక్కువ వ్యయం, కార్బన్ ఉద్గారాలు తక్కువగా వెలువడటం లాంటివి దీనికి అనుకూలమని ఎంఐటీ, నాసా పరిశోధకులు పేర్కొన్నారు.

వర్క్ ఫ్రమ్ కారులో చేయొద్దు..

- **బెంగళూరులో ఓ మహిళకు ఫైన్ విధించిన ట్రాఫిక్ పోలీసు**
- **నగరంలో ట్రాఫిక్ కష్టాల్ని 'ఎక్స్'లో ప్రస్తావించిన నెటిజన్లు**

బెంగళూరు, ఫిబ్రవరి 13: కర్ణాటక రాజధాని బెంగళూరులో ట్రాఫిక్ కష్టాలు ఏ స్థాయిలో ఉంటాయో తెలిపే ఉదంతమిది! తాజాగా ఓ మహిళా ఉద్యోగి బెంగళూరు రోడ్లపై కారును నడుపుతూ..తన ల్యాప్‌ట్యాప్‌లో పనిచేసుకుంటున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. దీనిపై స్పందించిన ఆ రాష్ట్ర ట్రాఫిక్ పోలీస్ విభాగం, ఆమెకు పెనాల్టీ విధించింది. ఫిబ్రవరి 12న చోటుచేసుకున్న ఈ ఘటనపై ట్రాఫిక్ డీసీపీ (నార్త్) స్పందిస్తూ, 'కారు నడుపుతూ వర్క్ ఫ్రమ్ హోమ్ చేయొద్దు' అంటూ 'ఎక్స్'లో సందేశాన్ని పోస్ట్ చేశారు. ఆ మహిళా ఉద్యోగికి ఫైన్ విధించిన సంగతిని తెలియజేస్తూ ఓ ఫొటోను 'ఎక్స్'లో విడుదల చేశారు. వీడియో, ట్రాఫిక్ పోలీసుల ఫొటోలపై నెటిజన్లు కూడా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున స్పందించారు. ఆమె లైసెన్స్ రద్దు చేయాలని కొందరు అభిప్రాయపడగా, తప్పు



ఆమెది కాదు.. ఆమెపై అధిక పని భారాన్ని మోపిన యజమానిదే తప్పు అంటూ మరి కొందరు వాదించారు. మరొక నెటిజన్.. బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్ వల్లే ఇదంతా అని ఆరోపించాడు. 'మొన్న..వన్‌వేలో 17 కిలోమీటర్లు ప్రయాణించడానికి 2 గంటలు పట్టింది. మొత్తంగా రోడ్లపైన్నే 4 గంటలు పోతున్నది. మరోవైపు ప్రజా రవాణా కిక్కిరిసిపోయింది. తిండి, నిద్ర ఎప్పుడు! ఆమె కారు నడుపుతూ తప్పనిసరై ల్యాప్‌ట్యాప్‌లో పనిచేసింది' అని అన్నారు. ఆమె పని చేస్తున్న కంపెనీ సీఈవో, మేనేజర్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మరొక నెటిజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుడు ఆమె టీమ్ కాల్ అటెండ్ అవుతున్నది..అందులో తప్పేముంది..అని మరో నెటిజన్ అభిప్రాయపడ్డారు.